# హేమంత తుషారం - 4

''నోటితో పేరే చెప్పాలటండీ... అతని వాలకం చూసిన వెంటనే నాకర్థమైపోతేనూ...! అందుకే కదా మిమ్మల్ని ఓ మారు తీసుకురమ్మని చెప్పానూ...'' రామానుజం కూడా ఆశ్చర్యాన్ని అభినయించాడు.

''అలాగా...'' అంటూ ఆవిడ నిట్టూర్చింది. మా అన్నయ్యలకిద్దరికీ ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వరసైన వాళ్ళు. చిన్నప్పటినుండీ వీడిమీద మనసు పెట్టుకున్నారు కూడా! అబ్బాయి ఏమో... చదువుకున్న అమ్మాయినే చేసుకుంటాను, ఆపైన దగ్గిర సంబంధాలూ ఇష్టంలేదు' అంటూ మొండికేసుక్కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ కూడా హైస్కూలు చదువుతో ఆపేశారు లెండి. ఇపుడు... నాకు చెప్పకుండానే మీ అమ్మాయి గురించి... మాట ఎందుకు ఇచ్చాడో! అమ్మాయి ఏం చదివిందండీ...?'' విషయం కొంచెం అర్థం చేసుకున్న ఆవిడ ఆరాతీసింది.

రామానుజం కొంచెం తలవంచుకుని ''నేనూ అమ్మాయిని... పెద్ద చదువులకి పంపించలేదండీ!'' అని ''చదివిస్తే... ఎంతవరకైనా వెళ్ళిపోగలదు... అంత తెలివైనది! అబ్బాయికూడా చూసీ చూడగానే పిల్ల తెలివితేటల్ని పసిగట్టే కాబోలు... చదివించమని సలహా ఇచ్చాడు! ఇందుకే నన్నమాట! నాకూ ఇపుడే అర్థమౌతోంది...'' అంటూ వివరణా ఇచ్చాడు.

''అలాగా...'' అంటూ ఆవిడ పెద్దగా నిట్టూర్చింది...'' చూశారా... ఇంత దూరం వెళ్ళినవాడు కన్న తల్లికి ఒక్క మాటా చెప్పనేలేదూ...!'' ఆవిడ కంఠం బొంగురుపోయింది. వెంటనే మనసు కూడదీసుకున్నట్లు మామూలయిపోయింది.

''అవునండీ... మీరు ఎవరో మీనాక్షమ్మ గారిని అడిగి అడ్రసు తీసుకున్నానన్నారు... ఆమెకి అయినా పెళ్ళి విషయం చెప్పాడంటారా... నాకు మాత్రం ఏమీ తెలియదు. నేను... ఈ రోజు పత్రికలో సీరియల్ చదువుతూ మా వాడితో 'తుషార ఈ ఊళ్ళోనే ఉంటారట కదా, ఒకసారి ఆమెను కలిస్తే బావుంటుంది' అన్నా. 'నాకు తెలుసు నేనొక సారి కలిసానని నీకు చెప్పాకదా, ఈ రోజు సాయంకాలం కాలేజికి వెళ్ళే ముందు... దారి అటే కాబట్టి నిన్నూ తీసుకెళ్తానమ్మా' అన్నాడు. అలాగే తీసుకువచ్చి 'ఇదే ఇల్లు... నేను పనిపూర్తి చేసుకుని గంటలో వచ్చేస్తా' అంటే... చెప్పా కదండీ... నేనే అవసరం లేదన్నాను. ఎదురుచూస్తూ కూర్చోవటం ఎందుకూ, మాట్లాడి వెళ్ళిపోవచ్చులే అనుకున్నా...!' అంది ఆవిడ రామానుజంతో.

ఆయన తలవూపుతూ ''ఇందులో ఇబ్బందేం లేదండీ... నేను దగ్గరుండి మిమ్మల్ని రిక్షా మాట్లాడి పంపిస్తాకదా!'' అని ఆవిడ వేపు ఆరాగా చూస్తూ''అయితే మీరు... కథలు రాసే ఆవిడను కలవాలని వచ్చానంటారు. సరే... ఆ పనీ కానిద్దాం...'' అంటూ మళ్ళీ కూతురికి మీనాక్షమ్మ గారిని పిలుచుకు రమ్మని చెప్పాడు.

''ఆవిడ గుమ్మంలోనే నిలబడి ఉన్నారుగా, నేనే పిలుస్తా. మీరు చెబుతున్న తుషారే మా మీనాక్షమ్మగారు...'' అంటూ గుమ్మందగ్గిరికి వెళ్ళి కామేశ్వరి కేకపెట్టింది.

మరునిమషమే ''ఎవరో వచ్చినట్లున్నారు... నన్ను పిలిచారేమిటీ...?'' అంటూ ఆవిడ వచ్చింది. రామానుజం మొహం ఇంకా గంటు పెట్టుకునే ఉన్నాడు. ''ఈవిడ... అదే... అపుడు మీ ఇంటికి వచ్చిన అబ్బాయి పేరు ఏమిటో అన్నారూ... ఆ... హేమంతు... అతని తల్లిగారు. మీరు కథలు గట్రా రాస్తారుగదా... మీతో మాట్లాడదామని వచ్చారు...టా...'' అన్నాడు.

ఆయన కంఠస్వరంలో ఆశాభంగం, వ్యంగ్యం రెండూ ధ్వనించాయ్!

కామేశ్వరి చొరవ తీసుకుని ఇద్దరికీ ఒకరి గురించి ఒకరికి పరిచయం చేస్తున్నట్లుగా చెప్పింది.

ఆవిడ ''నా పేరు చెప్పనేలేదు ఇంతవరకూ... వసుంధర అండీ. తుషార... మీరేనా...?'' అంది ఆశ్చర్యంగా.

ఆవిడ వైపు మీనాక్షమ్మ నిర్లిప్తంగా చూసి తలవూపి వూరుకుంది.

ఆవిడ చాలా ఉత్సాహంగా మాటలు మొదలుపెట్టింది. ''మీ కథ, సీరియల్ ఏవైనాసరే, పత్రికలు వచ్చినవెంటనే ముందుగా చదవాలని నేనూ, మా అబ్బాయి పోటీ పడతాం! అంత ఇష్టం మాకు! ఒక గంటసేపైనా నచ్చిన సన్నివేశాలు, మాటలు, వర్ణనలు.. అలా  అన్నింటి గురించీ మేమిద్దరం చెప్పుకుంటాం! అలా ఆ పత్రిక వచ్చినరోజు మాకు బోలెడంత కాలక్షేపం! నేనయితే... మీ సీరియల్స్‌ని ప్రతీ వారం ఆ పేజీల్ని కత్తిరించి దాచి పూర్తయ్యాక బైండు కూడా చేయిస్తా! అదో సరదా నాకు.... అంత పిచ్చి అనుకోండి...'' అంటూ నవ్వి ''మా చుట్టుపక్కల వాళ్ళంతా ఆ బైండు పుస్తకాలు తీసుకెళుతుంటారు. బదులు తీసుకున్న ఏవస్తువు తిరిగి ఇవ్వకున్నా పట్టించుకోనుగానీ... ఆ పుస్తకాల విషయంలో మాత్రం అలా చేస్తే... ఊరుకోనండోయ్! వెంటబడి తిరిగి తీసుకుంటా! చాలామంది చదివాక జాగ్రత్తగానే ఇచ్చేస్తూంటారనుకోండీ! మిమ్మల్ని కలిసాననే ఆనందంలో నేను ఒకటే మాట్లాడేస్తున్నా... మీరేమీ మౌనంగా ఉండిపోయారూ....?''

మీనాక్షమ్మ చిరునవ్వుతో తలవూపింది. ''మీ మాటలు వింటోంటే చాలా ఆనందంగా ఉంది. అంతకన్నా చెప్పేదేం లేక మౌనంగా ఉండిపోయా. నేను ఈ విషయమే ఎవరికీ తెలియనివ్వను. తెలిసిన కొందరు కథల గురించి..... ఏవేవో అభిప్రాయాలూ, ఏమిటీ అంటూ ప్రశ్నలు వేస్తూంటారు. 'నా అభిప్రాయాల్నీ, ఆలోచనల్నీ కథలద్వారానే చెబుతూంటాగా, ఇక వేరేగా చెప్పేదేం ఉండదూ...' అని ఈ మాటే చెప్పి వూరుకుంటా...!''

''అలాగా...'' అంటూ తలవూపింది వసుంధర.

కామేశ్వరీ కల్పించుకుని మాట్లాడింది. ''అవునండీ... మీనాక్షమ్మగారు ఎప్పుడూ ఫలానా పత్రికలో కథ వచ్చిందని గానీ ఏమీ చెప్పరు. నేను మహాలక్ష్మిగారి నడిగి అపుడపుడూ పత్రికలు తీసుకుని చదువుతుంటాగా, అపుడు తెలుస్తుంటుంది కథ వచ్చిందని మాకూ పక్కనే ఉంటున్నా మొన్న మొన్నటి వరకూ మీనాక్షమ్మగారు 'తుషార'

పేరుతో కథలు రాస్తారనే విషయమే తెలీదు. రామానుజంగారే చెబితే తెలిసింది! మేం మామూలుగా కాలక్షేపం కబుర్లే చెప్పుకుంటాం. కథల ప్రస్తావనే ఉండదండీ!''

వసుంధర మీనాక్షమ్మ వేపు చూసి ''మీరన్నదీ నిజమే! కథలద్వారానే మీ అభిప్రాయాలు, ఆలోచనలూ అన్నీ తెలుస్తాయి.... ఇక ప్రత్యేకంగా వాటి గురించి మాట్లాడేదేం ఉంటుందీ...' నాకు మాత్రం... మిమ్మల్ని కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది! ఇక వెళ్లొస్తానండీ!'' అంటూ లేచి నిలబడి ''వడ్లగింజలో బియ్యపు గింజ సామెతలా ఏదో పొరపాటు జరిగివుంటుందనిపిస్తోంది. మీ కార్డు అందాక, అబ్బాయిని విషయం ఏమిటో మీకు వివరించమని చెబుతాను...'' అంది రామానుజం వేపు చూసి.

ఆయనేం మాట్లాడకుండా తలవూపి ముభావంగా చూసి లోపలకు వెళ్ళిపోయాడు. మీనాక్షమ్మ కామేశ్వరి వేపు చూసింది. ఆవిడ చెప్పిందేమిటో అర్థమైనట్లుగా కామేశ్వరి ''రండి...'' అంటూ ఆమె వెంట ఉండి... బయటకు వెళ్ళి ఆవిడను బండి ఎక్కించి వచ్చింది.

మీనాక్షమ్మ బయటకు వచ్చింది. వాళ్ళిద్దరూ అక్కడ ఉండగానే లోపలనుండి విసురుగా వచ్చిన రామానుజం గుమ్మం దగ్గిర నిలబడి రుసరుసలాడాడు.

భాస్కరాంబా తమ ఇంటి గుమ్మం ముందు నిలబడి ఉంది. రామానుజం ఇంట్లో ఏదో జరుగుతుంది. తెలుసుకోవాలనే తహతహ ఆమెలో ఎక్కువైంది.

రామానుజం అందరివేపు ఓ చూపు చూసి ''ఈ చోద్యం విన్నారుటండీ! మొన్నామధ్య అబ్బాయి వచ్చి... పిల్లని చూసి... తల్లిని తీసుకువస్తానని చెప్పాడా... ఈ రోజు ఆవిడగారు వచ్చి... తనకేం తెలియదంటుందేమిటండీ... విడ్డూరం..! ముందుగా మా ఇంటికే వచ్చి కూర్చుని, కాసేపటి తర్వాత ఏం ఆలోచించిందో, ఏమనుకుందో ఆ భగవంతుడికే ఎరుక... అపుడు ఇంకెవరినో కలవాలని వచ్చానని చెబుతోంటే... ఏమనుకోవాలీ! కట్నం ఆశో, మరోటో ఉంటే.. చెప్పేస్తే సరిపోదా....? నేను ముక్కు సూటి మనిషిని.... ఇలాంటి శషభిషలు నాకు నచ్చవ్! ఒళ్ళు మండినా మర్యాదకోసం, నోరు మూసుకోవాల్సి వచ్చింది...!'' అన్నాడు.

రుక్కమ్మ కూడా వచ్చి ఆయన వెనకగా నిలబడిరది.

భాస్కరాంట రుక్కమ్మని ఉద్దేశించి ''నువ్వయినా ఆవిడ్ని గట్టిగా నిలదీయకపోయావా? మొన్న వచ్చినపుడు నచ్చిందని చెప్పాడు... ఆ మాట తల్లికి చెప్పకుండా ఉంటాడా?'' అంది.

‘‘అయ్యో పిన్నిగారూ... నాకేం తెలుసండీ! ఎవరు వచ్చినా నేనెప్పుడూ లోపలేగా ఉంటానూ... ఆయన చెబితేనే నాకూ విషయం తెలిసింది. మరి... నేనేమని అడగగలనూ...? ఏదైనా  ఆయన అడిగితేనే సబబుగా ఉంటుంది కదా...!’’ అంది రుక్కమ్మ అనిపిలవబడే రుక్మిణి.

‘‘అయితే ఆ అబ్బాయి... కనకాన్ని చూసి నచ్చిందనే మాట చెప్పినట్టేనా...?’’ భాస్కరాంబ మళ్ళీ ఆరా తీసింది.

‘‘నువ్వు... నీ నోరు ఆపి... లోపలికి వెళ్ళవే...!’’ రామానుజం భార్యని కసిరాడు..

‘‘ఇపుడు.... నేనేమన్నానూ...’’ అంటూ ఆవిడ మాటల్లో వినయం, చూపుల్లో నిష్టూరం చూపిస్తూ వెళ్ళిపోయింది.

‘‘నేను గట్టిగా ఓ మాట అడిగితే, ఆవిడ పరువు తీసినట్లుంటుందని ఆగాను. అంతే లేకపోతే... గొడవ పెట్టుకోవాలనుకుంటే ఎంతసేపూ...! నిముషం పట్టదు! అక్కడికీ ఈ రోజుల్ని బట్టి...కులం, గోత్రం... అంటూ చాదస్తాన్ని వదిలేసానా... అతను కూడా పిల్లని చదవించమని సలహాకూడా ఇచ్చాడా... ఎందుకనీ...? పిల్లల ఇష్టానికి పెద్దపీట వేసి ఒప్పుకున్నందుకు బాగా శాస్తి జరిగింది! ఏమో... ఇదీ మామంచికే అయివుంటుంది! వాళ్ళది ఏదో తక్కువ కులమే అయ్యుంటుంది. లేకపోతే.... ఇలాంటి మర్యాద తప్పి ప్రవర్తించే లక్షణాలు ఉండవ్...!’’ ఆవేశాన్ని అదుపు చేసుకుంటున్నట్లుగా గట్టిగా శ్వాసపీల్చి వదిలాడు.

మీనాక్షమ్మ తీక్షణంగా చూసింది.

‘‘అదేవిటండీ అలా మాట్లాడుతున్నారూ...? మీకు కులం పట్టింపు ఉంటే ఎవరూ తప్పు పట్టుకోరు! కానీ... కులంగురించే కాకుండా, ఎక్కువ తక్కువలంటూ మాట్లాడటం మాత్రం సరికాదు. మంచీ మర్యాదకు కులంతో సంబంధం ఏమీలేదు!’’

‘‘అదేంటి మీనాక్షమ్మగారూ.... మధ్యలో మీకు కోపం వచ్చిందేమిటీ? నేనేమీ మిమ్మల్ని అనలేదే...!’’ అంటూ ఆయన భుజాలెగురవేసాడు.

‘‘నన్నని కాదు.... అలా ఎవర్ని అన్నా తప్పేనంటున్నాను!’’ అంది.

‘‘ఖర్మ! ఈ రోజు అందరితో మాటలు పడాల్సివచ్చింది! పొద్దునే ఎవరి మొహం చూసానో, ఏమిటో...!’’ విసుక్కుంటూ లోపలకు వెళ్ళి తలుపులు విసురుగా వేసేసుకున్నాడు.

‘‘ఏమిటో... రామానుజంగారి అభిప్రాయం ఏమై ఉంటుందో నాకర్థం కావడం లేదు! ఆ అబ్బాయి... ఏం అన్నాడో.... ఏమిటో...! ఈయన ఇంకేదో ఊహించేసుకుని ముందర కాళ్ళకు బందాలేస్తున్నట్లుగా ఏదో చేసెయ్యాలనుకున్నాడేమో అనిపిస్తోంది!’’ అంటూ కామేశ్వరి చిన్నగా నవ్వింది.

''అవును... అంతే అయివుంటుంది...!'' అంటూ భాస్కరాంబా నవ్వు దాచుకుంది " పిల్లలకి ఇష్టమని కులం గురించి పట్టించుకోలేదంటాడేమిటండీ ఆయన! వాళ్ళిద్దరికీ స్నేహం ఏమైనా ఉందా... ప్రేమా దోమా అనుకోవటానికి! ఆయనది అమాయకత్వమో... లౌక్యమో తెలియటం లేదు...!''

''ఆయన సంగతి ఏమోగానీ... రుక్కమ్మ మాత్రం అమాయకురాలే! ఆయన ఏం చెప్పినా ఆవిడ వేదంలా నమ్మేస్తుంది! ఆరోజు... పెద్దమ్మాయికి పెళ్ళి కుదరిందండీ... అబ్బాయి ఎంత బావున్నాడో... చాటుగా చూశా... అంటూ అందరికీ పాపం ఎంత సంబరంగా చెప్పుకొచ్చిందో....!'' అంటూ కామేశ్వరి నిట్టూర్చింది.

''నిజమే...'' అంటూ మీనాక్షమ్మా నిట్టూర్చింది. ''ఆరోజు.... కనకరత్నం మొహంలో ఎంత వెలుగో...! ఎన్నో సంబంధాలు అనుకుంటాం... చూస్తాం... చివరకు ఏదో ఒకటి కుదురుతుంది! కానీ... ఈయనమీ లేకుండానే... అంతా అయిపోయినట్లుగా మాట్లాడి.... ఆ అమ్మాయిని మధ్యలో ఇబ్బంది పెట్టారనిపిస్తోంది...!''

అవును అన్నట్లుగా వాళ్ళిద్దరూ తలలూపారు.

ఎవరి వాటాల్లోకి వాళ్ళు నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

* * *

''ఇప్పుడు చెప్పండి... ఎందుకు మీరంతా గొడవ పడుతున్నారు...? క్లాస్‌రూమ్‌లో అందరి మధ్య ఈ పంచాయితీ ఎందుకని స్టాఫ్‌రూమ్‌కి రమ్మన్నాను.'' అనడిగింది మహాలక్ష్మి తన ఎదురుగా నిలబడిన విద్యార్థుల వేపు సూటిగా చూస్తూ.

ఒకతను గొంతు సవరించుకుని మెల్లగా ''నన్ను... నల్లగా ఉంటానని, వీళ్ళంతా కాకి... కాకి... అని గేలి చేస్తుంటారండీ...'' గొణిగినట్లు అన్నాడు.

ఇంకొకతను ''నన్ను.... కొంగ... అంటూ ఏడిపిస్తూంటారండీ...'' అన్నాడు. అతను పొడుగ్గా బక్కపలుచగా ఉన్నాడు.

మహాలక్ష్మి పెదవులపైకి చిరునవ్వు వచ్చింది. ''ఈ మాత్రానికేనా బాధపడుతున్నారు? కుక్క అన్నా పట్టించుకోకూడదు. అదేమీ అగౌరవం కాదు....!''

ఆ మాటలకు ఫిర్యాదు చేసిన వాళ్ళతో పాటుగా మరి ఇద్దరు ఆశ్చర్యంతో బిత్తరచూపులు చూస్తే.... మిగతా వాళ్ళు... అప్పటివరకూ తలవంచుకున్న వాళ్ళ మొహాల్లో ముసి ముసి నవ్వులు విరబూసాయి! తలెగరేసిన ఫోజులో పెదవులు బిగబెట్టి కంప్లైంట్ చేసిన వాళ్ళవేపు నిదానంగా, ధైర్యంగా చూసారు... మీకే శాస్తి జరిగింది కదా... అనే అర్థం వచ్చేట్లుగా!

మహాలక్ష్మి ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చింది. ''విద్యార్థి లక్షణాల గురించి ఒక శ్లోకం ఉంది. 'కాకదృష్టిర్బకధ్యానం శ్వాన నిద్రా'... అంటూ. అది చెప్పినా మీకెలాగూ అర్థం కాదు కాబట్టి, అనవసరం అనిపిస్తోంది. తెలుగులో చెబుతా. కాకి తన

రెండు వేపులా దృష్టి సారిస్తూ అప్రమత్తంగా ఉంటుంది. కొంగ ఒంటికాలిపై నిలిచి మరీ తన ఆహారం దొరికేంతవరకూ ధ్యానం చేస్తుంది! ఇంటికి కాపలా కాసే కుక్క నిద్రించేటపుడు కూడా జాగరూకతతో ఉంటుంది! శ్రద్ధగా విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థి లక్షణాలను చెప్పటంతో పాటుగా మితాహారం, వస్త్రధారణలో నిరాడంబరత కూడా ఉండాలని పెద్దలు చెప్పిన మాట!

అర్థమైందిగా...? అందుకే, కాకి, కొంగ, కుక్క లాంటి జంతువులకీ మనం నేర్చుకోదగ్గ మంచి లక్షణాలున్నాయని గ్రహించకుండా వాటిని అల్పజీవులుగా ఎంచి, వాటితో పోల్చి మనుష్యుల్ని వేళాకోళం చేయాలనుకోవటం తగదని చెప్పటానికే అలా అన్నాను. మంచి లక్షణాలున్న జంతువులతో పోల్చితే, బాధపడటం ఎందుకూ...? జంతువుల్లో నైనా, మనుష్యుల్లో అయినా రంగు ఆకారం గురించి కాకుండా మంచి లక్షణాల్నీ, ప్రతిభనీ గుర్తించటం, మెచ్చుకోగలగటం మనం నేర్చుకోవాలి! అవునా...?

మంచి బట్టలేసుకుని ఠీవిగా, దర్జాగా కాలేజికి వచ్చేవాళ్ళల్లో స్వంత ప్రతిభ ఏం ఉందీ... వాళ్ళ తల్లిదండ్రుల సంపాదన మాత్రమే కనుపిస్తుంది! మీ ప్రతిభతో వ్యక్తిత్వంతో అందరి అభిమానాల్ని పొందటానికి ప్రయత్నించండి! విద్యార్థుల్లో స్నేహభావం, చదువుపై దృష్టి మాత్రమే ఉండాలి! ఆఖరుగా ఒక మాట. మన పెద్దలు ఇంకో మాటా అన్నారు.... చెప్పటమే మా ధర్మం.... వినకపోతే మీ ఖర్మం అని! ఒక మేడమ్‌గా మాత్రమే కాకుండా, మీ కుటుంబ సభ్యురాలిగా సలహా ఇచ్చాననుకుని ఆలోచించి చూడండి... సరేనా, ఇక వెళ్ళిరండి...!''

అందరూ వినయంగా నమస్కరించి అక్కడనుండి నిష్క్రమించారు.

స్టాఫ్ రూమ్ గుమ్మం దగ్గిరే నిలబడిపోయి, మహాలక్ష్మి మాటలు పూర్తయ్యాక వాళ్ళందరూ వెళ్ళిపోతోంటే, అప్పుడు హేమంత్ లోపలకు వచ్చాడు. పక్కనే నిలబడిన అతన్ని చూసి మహాలక్ష్మి అప్రయత్నంగా లేచి నిలబడి ఆశ్చర్యంగా చూస్తూ ''మీరు  మా ఇంటికి రావటం నా కిష్టం లేదనిపిస్తోందని, తొందరలోనే వేరే చోట కలుస్తానంటూ ఉత్తరంలో రాసారు. అంటే... కాలేజీలోనని నేననుకోలేదు! మీరు ఇలా... కాలేజికి రావటం... నాకస్సలు ఇష్టంలేదు...!'' గడగడా చెప్పేసింది.

''బావుందండీ...! ఈ కాలేజీ మీ స్వంతమా రావద్దని చెప్పటానికి, మీరు మాత్రం రావచ్చా...?'' చిరునవ్వుతో అడిగాడతను.

''పిల్లలకి పాఠాలు చెప్పే ఉద్యోగం నాకుంది కాబట్టి వస్తున్నాను...'' తీక్షణంగా చూస్తూ బదులు చెప్పింది మహాలక్ష్మి.

''నేనూ అందుకే వచ్చానని ఎందుకు అనుకోకూడదూ...?''

''ఏమంటున్నారు... నిజంగా... మీకు.... ఇక్కడ... ఈ కాలేజీలో ఉద్యోగం....?'' ప్రశ్నార్థకంగా చూసింది.

''అవునండీ. ముమ్మాటికీ నిజమే. నేనీరోజే జాయినయ్యాను. మీ ఇంట్లో కాకుండా వేరేచోట కలుస్తానని మీకు ఉత్తరంలో రాసాకదా... ఆ రోజే నేను సెలక్ట్ అయ్యానని తెలిసింది. జాయినవటం మాత్రం ఈ రోజు...''

''నేను... ఇంకోలా అనుకున్నాలెండి... మిమ్మల్ని... పెళ్ళిపీటల మీద కలుస్తాననీ...'' ఆమె మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చి హేమంత్ కళ్ళు పెద్దవిచేసి ''ఏం... ఏమంటున్నారు....? అంత తొందరగా అలాంటి నిర్ణయం తీసుకున్నారా....?! నిజంగా....! మరి... నాకూ మీ మనసులోని మాట చెప్పివుంటే... చాలా సంతోషించేవాడిని కదా...!''

నిర్ఘాంతపోయినట్లు అతనివేపు చూసిన ఆమె తన మాటల్లో ఇంకో అర్థం ఉందనే విషయం గమనింపుకు వచ్చి గతుక్కుమంది!

''అయ్యో.... అదేమిటలా మాట్లాడుతున్నారు...? మీ కలా తప్పుగా అర్థమైందా... మీ ఉత్తరం అందినరోజే, నాన్నమ్మ నాకు... మా ప్రక్క పోర్షన్ లో ఉండే రామానుజం గారి పెద్దమ్మాయి కనకరత్నానికీ, మీకూ పెళ్ళి నిశ్చయమైందని చెప్పింది. మా పొరుగునే ఉండే వాళ్ళమ్మాయి పెళ్ళికి రాకుండా

ఉండనుగా, అందుకే... ఆ పెళ్ళిలో కలుసుకుంటామనే విషయాన్ని మీరలా పరోక్షంగా చెప్పారని అపుడు అనుకున్నా. ఇపుడూ ఆ ఆలోచనతోనే అలా అన్నానంతే...! అలా చూసిన వెంటనే... పెద్దవాళ్ళతో కూడా సంప్రదించకుండా, మీరే నిర్ణయించేసుకుని మాట్లాడుకోవటం అంత తొందరేమిటా అని ఆశ్చర్యపోయా! ఇంతకీ పెళ్ళి....''

''ఆగండాగండి... నేను తొందరపడ్డానో లేదో గానీ, మీరు మాత్రం తొందరపడి నిర్ణయించేసుకుంటున్నారు... నా పెళ్ళి గురించి... నా సమ్మతం లేకుండానే ఖరారు చేసేస్తున్నారు! నేను రావటం మీకిష్టం లేదని గ్రహించి, మీరుండని సమయం చూసుకుని వస్తే బామ్మగారు బయటకెళ్ళారంటూ రామానుజంగారు తమ ఇంట్లో కూర్చోబెట్టటమే కాకుండా పెళ్ళి చూపుల ఏర్పాటులాంటి తతంగం నడిపించారు. ఆయన మా అమ్మను తీసుకురమ్మని చెబితే, మాటవరుసకు సరేనన్నా. మా అమ్మకి తుషారగారిని కలుసుకోవాలనే కోరిక ఉందని తెలుసు కాబట్టి, అది మనసులో పెట్టుకుని నేను మాట్లాడితే....''

''ఆయన... కనకరత్నం మీకు నచ్చిందనే అభిప్రాయంతో పెళ్ళి మాటలకు మీ అమ్మగారిని తీసుకురావటానికి అంగీకరించారని అనుకున్నారు కాబోలు...!''

''అదే అయివుంటుంది! ఆయన మాటల్లో అలాంటి అభిప్రాయం ఉందని నాకర్థం అయింది గానీ, నా అంతట నేనే పెళ్ళి మాట ఎత్తి కాదని చెబితే, ''నేనేమీ మిమ్మల్ని అడగకుండానే అలా మాట్లాడటం ఏమిటీ' అని ఎదురు తిరిగితే బావుండదు కదండీ' అందుకే ఆయనేవో వివరాలు అడిగితే నేనూ సరదాగా సమాధానాలు చెప్పాను. ఆ మాత్రానికే...'' అంటూ మధ్యలో మాటలు ఆపేసి, ఒక క్షణం ఆలోచనలో పడి తలపట్టుకున్నాడు.

‘‘అమ్మో.... పెద్ద ప్రహసనమే జరుగుతూండి వుంటుంది ఈ పాటికి మీ ఇంట్లో మా అమ్మకు ‘తుషార గారి ఇల్లు ఇదే’ అని చూపించి, అక్కడ వదిలి నేనిటు వచ్చేసా.... ఆ రామానుజంగారూ వాళ్ళ కబుర్లలో జొరబడి ఏం గందరగోళం చేస్తున్నారో. ఏమిటో! ఆయనకసలే ఆరాలెక్కువ. మీ ఇంటికి మొదటిసారి వచ్చినపుడు ‘మీనాక్షమ్మగారింటికా, మీ బంధువులా...?’ అని ఎదురుపడి అడిగారు. ఇపుడు... మా అమ్మతో డైరెక్టుగా పెళ్ళి మాటలు మొదలుపెడితే, తికమకపడి ఏం చెబుతోందో... ఏమిటో... ఆయన ఇంట్లో లేకుండా ఉంటే ఫరవాలేదుగానీ, ఉంటే మాత్రం...’’

‘‘ఏం తమాషా జరుగుతోందో.... ఏమిటో...’’ అంటూ మహాలక్ష్మి పెద్దగా నవ్వింది. భయం నటిస్తూ, నవ్వు మొహంతో హేమంత్ చేసిన అభినయానికి మహాలక్ష్మికి బాగా నవ్వొచ్చింది.

అపుడే లోపలకు వచ్చిన హిందీ పండిట్ కామేశం వాళ్ళ దగ్గరకు వచ్చి ‘‘మహాలక్ష్మి గారూ... ఇలా మీరు హాయిగా నవ్వటం చూడగలుగుతున్నానంటే... ఈ రోజు నిజంగా పండుగే నంటే నమ్మండి... నా కళ్ళకు!’’ అని ఓ క్షణం హేమంత్‌ని పరిశీలనగా చూసి ‘‘వీరు... మీకు అయినవారా... లేక అవబోతున్న వారా...? ఏమైనా మీ ఇద్దరూ చూడచక్కగా ఉన్నారు సుమండీ...’’

అతని మాటలకు అడ్డుకట్ట వేస్తూ ‘‘వీరు.... మన కాలేజిలో... ఈ రోజే జాయిన్ అయ్యారు... మనలాగే స్టాఫ్.... ’’ అంటూ మహాలక్ష్మి జవాబు చెబుతోంటే కామేశం మళ్ళీ హడావుడిగా ‘‘పొరపాటుగా మాట్లాడానా... అయితే క్షమించండి...’’ అంటూ హేమంత్‌తో చేయి కలిపాడు.

‘‘మహాలక్ష్మిగారెపుడూ చిరునవ్వులో మాత్రమే కనిపిస్తుంటారు. ముక్త సరిగా మాట్లాడతారు.. అయితే ఈ వేళ అలా కాకుండా ఇంత సరదాగా నవ్వటం చూసి కంగారులో ఏదో అన్నాలెండి. మీకు మహాలక్ష్మిగారు ముందే తెలుసా....?’’

కామేశం ప్రశ్నకి హేమంత్ చిరునవ్వుతో చూసి ‘‘ఒకసారి మాత్రమే కలిసా వీరు... తుషార...’’ అని చెప్పబోతోంటే కామేశం మళ్ళీకంగారు పడ్డాడు.’’ నిజమా.... మహాలక్ష్మిగారీ మాట మాకెపుడూ చెప్పనే లేదు సుమండీ! ఇపుడే... కాంటీన్‌లో మేం నలుగురం ఈ రోజు పత్రికలో వచ్చిన తుషార సీరియల్ గురించి మాట్లాడుకున్నాం. మహాలక్ష్మిగారి కలంపేరే తుషార అని మన వాళ్ళందరికీ చెప్పిరావాలి....’’

‘‘ఆగండి కామేశం గారూ... మీ ఇంటిపేరు ‘కంగారు’ గా మారిపోయిందని వీరికి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేకుండా చేసేస్తున్నారు. చెప్పేది పూర్తిగా వినరేం...? తుషార కలం పేరు పెట్టుకున్నావిడ మా కాంపౌండ్‌లోనే ఉంటారని తెలిసి ఈ హేమంత్‌గారు వచ్చారు. అప్పుడు కొంచెం పరిచయం  అంతే. అదే చెప్పబోతున్నారు...’’ అంటూ మహాలక్ష్మి హేమంత్ వేపు ‘అంతే కదండీ...?’ అన్నట్లుగానూ చూసింది.

అతను కూడా అవునన్నట్లుగా తలవూపి మౌనంగా ఉండిపోయాడు.

‘‘అవునా....’ అంటూ కామేశం నీరసపడినట్లుగా మొహం పెట్టాడు.

‘‘పోనీ... మీ దగ్గర్లోనే కాబట్టి... మేం అందరం ఒకరోజు వస్తాం... మీరు పరిచయం చేయొచ్చుగా ఏమంటారు....?’’ అని మహాలక్ష్మిని మళ్ళీ అడిగాడు కామేశం.

‘‘ఆవిడేమో తన ఉనికి ఎవరికీ తెలియకూడదన్నట్లుగా ఉంటే, మనం మాత్రం కనిపెట్టి ఎందుకు వెళ్ళాలండీ...?’’ అంది మహాలక్ష్మి కామేశం వేపు చురుగ్గా చూస్తూ..

‘‘బావుందండీ అదేం మాట! ఆమె రచనల గురించి మన ఇష్టాయిష్టాలు చెబితే వినటం... ఆమె ఆలోచనలు, అభిప్రాయాలూ తెలుసుకోగలగటం... ఆమెకూ, మనకీ కూడా ఆనందంగానే ఉంటుంది కదా....?’’

మహాలక్ష్మి మళ్ళీ జవాబు చెప్పింది.... ‘‘ఈ హేమంత్‌గారు కలిసినపుడు... ఆవిడే ‘నా అభిప్రాయాలూ, ఆలోచనలూ ప్రత్యేకంగా తెలుసుకోవాల్సినవి ఏముంటాయీ అవన్నీ నా కథల్లోనే వెల్లడి అవుతుంటాయిగా, ఏవైనా విమర్శలూ, ప్రశంసలూ తెలియజేయాలనుకుంటే, పత్రిక వాళ్ళకి

ఉత్తరం రాస్తే, వాళ్ళే పంపిస్తారుగా అనీ అన్నారు...’’

హేమంత్ అవునన్నట్లుగా మళ్ళీ తలవూపాడు. పెదవులపైకి రాబోయిన నవ్వును అతను బిగబట్టినట్లుగా అనిపించింది మహాలక్ష్మికి.

‘‘సరేలెండి. ఆవిడంత బెట్టుగా గిరిగీసుకుని కూర్చుంటే, మీరన్నట్లుగా మనం మాత్రం ఎందుకు వెంటబడటం...! ఆవిడగారి కథల్ని మెచ్చుకునే వాళ్ళెంతమంది ఉన్నారో, ఇవేం కథలని తీసిపారేసేవాళ్ళూ అంతమంది ఉన్నారట....’’ పెదవి విరుస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు కామేశం.

‘‘మీరన్నది నిజమేనండీ కామేశం గారూ! మా కాంపౌండ్‌లో ఉండే ఒకాయన అందరితో అంటూంటారు. ‘ఇంట్లో గొడవల్నీ, కబుర్లనీ మూటగట్టి కథలంటూ పత్రికలకు పంపిస్తే, వాళ్లేమో పాపం ఆడవాళ్ళని నిరుత్సాహపరచటమెందుకనుకుంటూ పత్రికల్లో వేసేస్తుంటారు! అందుకే చాలామంది మగవాళ్ళు కూడా ఆడవాళ్ళ పేర్లతో అయితే తిరిగి రాకుండా ప్రచురింపబడతాయని, వాళ్ళ ఆడవాళ్ళ పేరుతో పంపిస్తూంటారని విన్నానూ....’ అని! ఇంకొందరేమో బావున్నాయని చెప్పి వూరుకుంటారు. నిజమో, మొహమాటానికి అంటున్నారో అర్థంకాదు. ఇంకొందరు... చాలాకొద్దిమంది కథ తమకు ఎందుకు నచ్చిందో, ఏ వాక్యం ఆకట్టుకుందో కూడా వివరంగా ఉత్తరాలు రాస్తూంటారు...ట....’ ఆవిడే ఒకసారి చెప్పారు...!’’ అంటూ మహాలక్ష్మి ఓరగా హేమంత్ వేపు చూసింది.

హేమంత్ కూడా చిరునవ్వులు చిందించాడు మహాలక్ష్మి మాటలను అంగీకరిస్తున్నట్లుగా.

''సరే... టైమయిందిగా, నేను బయలుదేరుతున్నాను...'' అంటూ టేబుల్ పై ఉన్న ఒక నోట్ బుక్‌ను చేతిలోకి తీసుకున్నాడు.

''మంచిది.... రేపు కలుద్దామండీ, కామేశంగారూ...'' అంటూ హేమంత్ చేయి కలిపాడు.

''ఒట్టి కామేశం కాదండీ.... ఇక్కడ మనవాళ్ళంతా కలిసి నా పేరును 'కంగారు కామేశం'గా ఫిక్స్ చేసేశారు. ఇందాకనే మహాలక్ష్మిగారూ చెప్పారుగా...'' అంటూ అతను సరదాగా నవ్వాడు... వాళ్ళిద్దరూ కూడా అతని నవ్వుతో శృతి కలిపారు.

* * *

హేమంత్, మహాలక్ష్మి కూడా బయలుదేరబోతున్నప్పుడు, ఆమె ''ఒక క్షణం ఆగండి. నాదో సందేహం. ఈ కాలేజీలో లెక్చరర్ల శాలరీ కొంచెం తక్కువేనని మీకూ తెలిసే ఉంటుంది కదా, మరి... కోరుకున్నట్లుగా ఇక్కడ ఎందుకు చేరినట్లూ...? అసలు చేతిలో ఏ ఉద్యోగమూ లేకపోతే, అది వేరే సంగతిగానీ...'' అంది.

హేమంత్ ఒక క్షణం ఆలోచిస్తూన్నట్లుగా మొహం పెట్టి ''రెండు కారణాలు ఉన్నాయండీ. మొదటిది ఏమిటంటే... అక్కడ స్టూడెంట్స్, స్టాఫ్ మధ్యలో కూడా కులాల దురభిమానం బాగా వేళ్ళూనుకుని

ఉంది. నాలాంటి వాళ్ళు దూరంగా ఉందామనుకున్నా వీలుకాకుండా కొందరు ఆ రొచ్చులోకి లాగే ప్రయత్నం చేస్తూనే ఉంటారు! ఇంతలో ఈ కాలేజి ప్రిన్సిపాలు మాకు బాగా తెలిసినవారవటంతో ఇక్కడ ఖాళీ ఉందనే విషయాన్ని తెలియజేయటంతో అప్లై చేసాను. ఇది ఒకటైతే... రెండో కారణం సంగతి వద్దులెండి... మీరు మరోలా అనుకోవచ్చు....!'' అన్నాడు.

అతని పెదవులపై తారట్లాడుతున్న చిరునవ్వును చూస్తూ మహాలక్ష్మి ఆశ్చర్యంగా అడిగింది ''అంత చెప్పకూడనిది ఏం ఉంటుందీ... ఫరవాలేదు... నేనేం అనుకోను చెప్పండి...''

''మీరలాంటి హామీ ఇచ్చారు కాబట్టి నిర్భయంగా చెబుతున్నా. పొట్టకూటికి ఉద్యోగం అవసరమే గానీ, అది చేసే చోట నచ్చిన వాతావరణం ఉంటే... మనసు నిండిన అనుభూతితో ఆహ్లాదంగా ఉంటుంది! అవును కదా...? క్లాస్‌రూమ్‌లో పాఠం చెప్పి, స్టాఫ్ రూమ్‌కి వచ్చి కూర్చుంటే, హాయిగా పలకరించే వాళ్ళు ఒక్కరూ ఉండరు! పేరుకు చాలామందే ఉంటారుగానీ, గ్రూపులు, గోల ఎవరిది వారిదే! ఆపైన కనువిందు చేసే మహాలక్ష్ములూ లేరు...''

''ఏమంటున్నారు...?!'' మహాలక్ష్మి తీవ్రంగా చూసింది.

''ఎందుకండీ అంత కోపం....? నాకు తెలుసు... మీరు అపార్థం చేసుకునే అవకాశం ఉందని! అందుకేగా, ముందుగా హామీ కూడా తీసుకున్నానూ...! నా ఉద్దేశ్యం మహాలక్ష్ములు అంటే... ఆడవాళ్ళని... అంతే... మీరే అని కాదు లెండి! చిరునవ్వుల సిరితో కనుపించే ఆడవాళ్ళు ఎక్కడుంటే... అక్కడ... ఆ ప్రాంతం.... అదోవిధమైన కళతో, అందంగా

మారిపోతుందని  నా అభిప్రాయం! ఈ మాట నేనే కాదు, మన పెద్దవాళ్ళూ చెప్పారు! మన ఇంట్లో... అమ్మ, చెల్లి లేక అక్క, భార్య.... ఇలా ఎవరో ఒకరుంటే ఒకలా, ఎవరూ లేకపోతే ఇంకోలా ఉంటుందనేని నిజమే కదా...?''

చిరునవ్వుతో ఆమె వేపు సూటిగా చూశాడతను.

ఏం మాట్లాడలేని దానిలా మహాలక్ష్మి మౌనం వహించింది.